# మనవలు! మనవరాళ్ళు!

ఆఖరి బొబ్బట్టు ఒత్తి పెనంమీద వేసి, అది కాలే లోపల చారు పోపేద్దామని, పోపుల డబ్బా తీసి పోపేశాను. 'చుయ్' అనే ఆ శబ్దం రాగానే, ఒకసారిగా నా ఆలోచనలు మూడేళ్ళు వెనక్కెళ్ళాయి. ఆ 'చుయ్' అనే శబ్దం వినగానే పరుగెత్తుకొచ్చేది మా నీతూ కూతురు సౌందర్య. దాని వెనకే ఒచ్చేది ఐశ్వర్య 'అమ్మమ్మా! చుఁయ్ అయిపోయిందా? అయితే అన్నం పెట్టు' అంటూ. కూరలు తరుగుతూ వుంటే 'ఇది కూర చేస్తావా? అమ్మమ్మా... నాకు ముద్దపప్పే కావాలి. టమాటాలూ, ఆకులూ వెయ్యకు' అనేది సౌందర్య. 'నాక్కూడా... నాకు నిమ్మకాయకూడా కావాలి. పప్పులో ఆకులు వెయ్యకు' అనేది. ఐశ్వర్య ఆక్కూరలని ఒద్దని చెబుతూ. ఇలా వంట చేస్తున్నంతసేపూ నా చుట్టూ తిరిగేవారు. వాళ్ళమ్మ నీతూ కాలేజికి పోతూ పోతూ వీళ్ళని నా దగ్గర ఒదిలిపెట్టి వెళ్ళేది. కాలేజీ అయిపోయాక ఇంటికి వెళుతూ వీళ్ళను తీసుకెళ్ళిపోయేది. ఒక్కోమారు వీళ్ళు "మేము రాము అమ్మమ్మ దగ్గరే వుంటా"మనే వాళ్ళు. 'సర్లే!' అని ఊరుకునేది నీతూ, వాళ్ళ ప్లాన్‌కి నా సపోర్ట్ వుంటుందని తెలిసి. సౌందర్యకి నాలుగేళ్ళు! ఐశ్వర్యకి రెండేళ్ళు! ఆడపిల్లలకి మాటలు త్వరగా వస్తాయంటారు. చక్కగా మాట్లాడేవాళ్ళు ఇద్దరూ. ఇప్పుడెలా వున్నారో! మూడేళ్ళవుతోంది వాళ్ళని చూసి. అప్పటి కథలూ, ఆ తిళ్ళూ ఇప్పుడు నచ్చుతాయో లేదో?

'పార్వతీ! ఇంకా వంట కాలేదా?' ఆయనగారి కేక.

'అయిపోయిందండీ. పెట్టేస్తున్నాను' అన్నాను.

టేబుల్ సర్ది కంచాలు పెడుతూ ఉంటే మళ్ళీ ఆలోచనలే.

'అక్కడ వెళ్ళాక అందరూ తెలుగు రాయడం చదవడం ఒదిలిపెట్టి మాట్లాడ్డం కూడా మానేస్తారట. సుజాత పిల్లలకి కాస్త కూడా తెలుగు ముక్క అర్థం కాదుట. తను తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నిస్తే 'గ్రాండ్‌మా... ప్లీజ్ డోంట్ టాక్ ఇన్ దట్ లాంగ్వేజ్! బోర్!' అనే వారుట. సుజాత ఎంత బాధపడిపోయిందో! అలాగే ఉమ మనమరాళ్ళు కూడా... తను మాట్లాడ్డం మొదలెట్టేసరికి, మాకర్థం కాదు అన్నట్టు, అక్కడి నుంచి లేచి వెళ్ళి టీ.వి. దగ్గర కూర్చునేవారట. దేనికీ సమాధానం చెప్పకుండా. ఉమ అయితే ఏకంగా ఏడుపే! అందరిలాగా మనవలతో ఆడుకునే అదృష్టం నాకు లేదని."

'పారూ! వంట కాలేదా? ఒంటిగంట దాటింది.' ఆయనగారికేక మళ్ళీ.

'ఆ... ఆ... పెట్టేస్తున్నాను. ఒక్కక్షణం. కంచాలు పెడుతూంటే జీవిత జ్ఞాపక మొచ్చింది. తన మనవలు ఇండియాకి రాగానే ఏడుపుట వెళ్ళిపోదామని అమెరికాకి. బాత్‌రూంలలో కార్పెట్లు లేవనీ, స్నానానికి టబ్‌లేదనీ గోలట. పైగా మన భోజనమే నచ్చేది కాదుట. జీవిత జాలిగా తన గోడు వినిపిస్తూంటే, నాకు ఏదో దిగులు పుట్టేది.

'పారూ! ఇంకా ఏం చేస్తున్నావ్ వంటింట్లో? నీకు నిజంగానే పిచ్చే. లేకపోతే ఏమిటి? ఇప్పటికే పదిహేను రోజుల నుంచీ చూస్తున్నాను. పచ్చళ్ళంటావ్! ఊరగాయలంటావ్! పొళ్ళూ, పిల్లలకి రకరకాల తిళ్ళూ, సున్నుండలు, లడ్డూలు, జంతికలూ, బొబ్బట్లూ. వాళ్ళు తినేవి పీజాలూ, ఐస్‌క్రీంలూ, కేకులూ 'వాళ్ళ భోజనం.'

'మీరు మరీను, నీతూకి, రాజేష్ ఇవన్నీ ఎంతిష్టమో! ఎందుకు... సౌందర్యా... ఐశ్వర్యా కూడా తింటారు. ఎక్కడ ఏం తిన్నా... తెలుగు రుచులూ, అభిరుచులూ పోవండీ! రాజేష్‌కి మనం ఆవపెట్టి చేసే కూరలంటే ఎంతిష్టమో' అన్నాను.

'పారూ! నీ నమ్మకం మంచిదే. కానీ, తీరా ఒకవేళ వాళ్ళివేవీ నచ్చలేదన్నారనుకో... నువ్వే బాధపడతావ్... అందుకే చెప్తున్నాను.'

ఆ భయం నాకూ వుంది లోలోపల. అయినా పైకి మాత్రం 'మన పిల్లల టేస్ట్ నాకు తెలీదూ?. పైగా నీతూ ఫోన్‌లో చెప్పింది. అందరం అన్నీ తింటామని' అన్నాను డాంబికంగా.

'సరే.. మళ్ళీ శంకరమఠంకి ప్రయాణం తప్పదన్నమాట. ఇవన్నీ పొట్లాలు కట్టించొద్దూ.'

'అవును!'

'ఇప్పటికే ఒక సూట్‌కేసు నిండిపోయింది. కస్టమ్స్‌లో పట్టుకుంటే మొత్తం ఒదిలెయ్యాల్సిందే. అంతేకాదు, ఈ పెట్టెలు తెరవడాలూ మొయ్యడాలూ నావల్లకాదు. నువ్వే చూసుకోవాలి. కంఫర్టబుల్‌గా, హాయిగా ప్రయాణాలు చెయ్యడం చాతకాదు తెలుగువాళ్ళకి' ' కాస్త కోపంగానే అన్నారాయన.

నేనేం మాట్లాడలేదు.

పాపం ఆయనే వస్తువులన్నీ ఓ బ్యాగ్‌లో వేసుకుని బయల్దేరారు ప్యాకింగ్ చేయించటానికి. ఆ షాపులో అయితేనే లావాటి ప్లాస్టిక్ కవర్లలో కారకుండా చక్కగా ప్యాక్ చేస్తారు. అందరూ ఆ షాపుకే వస్తారు. అక్కడొక 'క్యూ.'

* * *

ఆ రోజే ప్రయాణం. ఫినిక్స్ అడ్రసు రాసి పెట్టెలకి అతికిస్తోంది పెద్దమ్మాయి కవిత. కిరణ్ సూట్‌కేసులు సర్దుతున్నాడు. అన్ని ప్యాకెట్లూ ఒక్క సూట్‌కేసులో కాకుండా, వాటిని బట్టల మధ్య కుక్కుతున్నాడు. 'ఇన్ని బట్టలూ, ఇన్ని పొట్లాలూ పట్టుకెళ్ళాల్సిందేనా?' అన్నీ పెట్టెలో కష్టపడి కుక్కుతూ అడిగాడు కిరణ్.

'ఆఁ హాఁ' అన్నాను.

'కొన్ని చీరలు తీసెయ్యకూడదూ? అన్నెందుకు?' అన్నారాయన చిరాగ్గా. అల్లుడు పడుతున్న బాధ చూడలేనట్టు.

నాకూ బాధగానూ సిగ్గుగానూ అనిపించింది. కానీ, ఆరు నెలల ప్రయాణం. ఆ మాత్రం లేకపోతే ఎలా? పైగా మగాళ్ళంటే ఒక డ్రెస్సు నాలుగు రోజులు వేసుకుంటారు. ఆడవాళ్ళకలా కుదరదు కదా! అందుకే వాళ్ళకర్థంకాదు. మాట్లాడక ఊరుకున్నాను.

'అమ్మమ్మకి ఇంకా రెండు బీరువాల నిండా చీరలున్నాయి' అన్నాడు అభిషేక్ - పదకొండేళ్ళవాడు.

'అవును. ఇంకా కొన్ని తీసుకెళ్ళచ్చు' అన్నాడు అనురాగ్ - తొమ్మిదేళ్ళవాడు. రెండో మనవడు నాగ. వీళ్ళిద్దరూ మొగపిల్లలే అయినా, వాళ్ళమ్మ చదువుకోమని కేకలేస్తే క్రికెట్ ఆడుకోవాలని పారిపోయినా, ఇద్దరూ పోట్లాడుకుంటూ అమ్మని ఏడిపించినా, నేనంటే మహా ఇష్టం. నా దగ్గర కూర్చుని 'కథలు చెప్పు అమ్మమ్మా' అంటూ వెనక వెనక తిరుగుతారు.

'మీకెందుకురా నా చీరల గురించి. మీరిద్దరూ ఆడపిల్లలయితే నా చీరలన్నీ మీకిచ్చేసేదాన్ని'

'అయితే ఇప్పుడెవరికిస్తావ్? సౌందర్యకీ ఐశ్వర్యకీ ఇస్తావా? లేకపోతే సంయుక్తకి, సమీరకీ ఇస్తావా? అడిగాడు అభిషేక్.

'ఒరేయ్! సౌందర్యా, ఐశ్వర్యా అమెరికాలో వున్నారు. వాళ్ళు చీరలు కట్టుకోరు. జీన్స్ వేసుకుంటారంతే. సమీర కూడా సింగపూర్‌లో వుంది కదా! జీన్స్ వేసుకుంటుంది. సంయుక్త బెంగుళూరులో వుంది చిన్నపిల్ల కదా!' అన్నాడు అనురాగ్.

వాళ్ళ సంభాషణలకి నవ్వొచ్చి నవ్వేశాను. 'అమ్మమ్మా! చీరల గొడవ మాకెందుకులే, ఒక లడ్డూ ఇవ్వు, అన్నాడు అభిషేక్. 'నాక్కూడా' అన్నాడు అనురాగ్. సంతోషంగా వెళ్ళి లడ్లూ, జంతికలూ ప్లేట్లో పెట్టిచ్చాను. అంతలో టెలిఫోన్ మోగింది. సింగపూరు నుంచి సమీరా వాళ్ళమ్మ గీతిక.

'అమ్మా! ప్యాకింగ్ అంతా అయిందా? జాగ్రత్తగా వెళ్ళండి.'

'అయింది నీతూ - అలాగే! సమీర ఏం చేస్తోంది?'

'తమ్ముడితో ఆడుకుంటోంది. అమ్మమ్మ సౌందర్యా వాళ్ళకి బొబ్బట్లు తీసుకెళుతోందా?' అని అడుగుతోంది.

'పిచ్చితల్లి. దానికీ ఎంతో ఇష్టం. తీసుకెళుతున్నానని చెప్పు. కానీ, వాళ్ళు దీనిలాగా తింటారో లేదో తెలీదు' అన్నాను.

కాస్సేపు మాట్లాడి 'బై' చెప్పి పెట్టేసింది సమీర.

మళ్ళీ టెలిఫోన్ మోగింది.

ఆఖరమ్మాయి ప్రీతి!

'అమ్మా!... అంతా రెడీయా? నాన్నా, నువ్వూ మీక్కావలసిన మందులూ అవ్వీ తీసుకెళ్తున్నారుగా. అక్కడ మందులు చాలా కాస్ట్లీ.'

'అన్నీ కొనుక్కున్నాం. పెట్టెల్లో అన్నీ సర్దేయడం కూడా అయిపోతోంది. కవీ, కిరణ్‌లు సర్దుతున్నారు. సారిక బాగుందా? ఏం చేస్తోందీ?'

'నీతో మాట్లాడతానని గోల పెడుతోంది. మాట్లాడు.'

'హలో... అమ్మమ్మా... అమ్మమ్మా... నువ్వు మళ్ళీ ఎప్పుడొస్తావ్?'

'ఆరునెలల్లో!'

'అమ్మమ్మా! రామూ, సోమూ కథలన్నీ సౌందర్యకీ, ఐశ్వర్యకీ చెప్తావా?'

'నీలాగా వాళ్ళు వింటే చెప్తాను.'

'అమ్మమ్మా... అమెరికా నుంచొచ్చాక నువ్వు మా దగ్గరికొచ్చి ఎన్నాళ్ళుండాలో తెలుసా?'

'ఆరునెల్లు.'

'కాదు. పన్నెండు నెలలు. డబుల్! ఎందుకంటే నేను అందరికంటే చిన్నదాన్ని కదా!' దాని మాటలకి మనసు ఉప్పొంగిపోయింది. 'అలాగే!' అన్నాను.

'అమ్మమ్మా! ఒక పని చెయ్యి. వాళ్ళకి నువ్వు చెప్పే కథలన్నీ పేపరుమీద రాసి నాకు పోస్ట్ చెయ్యి. నేనిక్కడ చదువుకుంటా' ఆ మాటనగానే నా సంతోషానికి అవధుల్లేవు. ఆ పసి

మనసు కోరిక తియ్యని గిలిగింత. ఆ కథలన్నీ అప్పటికప్పుడు వాళ్ళ కనుగుణంగా ఆ పరిస్థితిని వివరిస్తూ అల్లిన చిన్న చిన్న కథలు. ఆ ఇన్సిడెంటు బాగా జ్ఞాపకం పెట్టుకుని మళ్ళీ మళ్ళీ తలుచుకోవడం, ప్రశ్నలడగడం చేసేది ముద్దు ముద్దు మాటలతో సారిక. ఉదాహరణకి వీళ్ళందరికీ కుక్కపిల్లలంటే ఇష్టం. మా ఇంట్లో నా చిన్నప్పటి కుక్క లిల్లీ. ఈనాటి వీరి కథల్లో మెయిన్ పాత్ర, రాము హీరో... సోము విలన్... అందులో లిల్లీ సైకిల్ తొక్కుతుంది. బాల్ ఆడుతుంది. అలా ఏవేవో చేస్తుంది. అమాయకంగా పిచ్చిపన్లు చేసి తిట్లు తింటాడు సోము. రాము లిల్లీని ఆదరిస్తూ అల్లరి చెయ్యని మంచి పిల్లవాడు. ఇలా ప్రతిరోజూ ఒక కథ అల్లి చెప్పాలి. ఆ క్షణంలో సారిక మాటలకి నన్ను నేనే మరిచిపోయాను. నిజంగానే అదన్నట్టు ఇవన్నీ గ్రంథస్థం చేస్తే, ఎందరో సారికలూ, సౌందర్యలూ, ఐశ్వర్యలూ సంతోషపడరూ?

'అమ్మమ్మా! ఏంటి మాట్లాడవూ? మాట్లాడూ...'.

'అలాగే సారికా! తప్పకుండా రాస్తాను.'

అంతలోనే సారిక చేతిలోని ఫోన్ లాక్కుంది ప్రీతి.

'ఓ.కే. అమ్మా... జాగ్రత్తగా వెళ్ళిరండి. నీతూని, రాజేష్‌నీ అడిగానని చెప్పు. ఈ మెయిల్ చేస్తాను. రిప్లై ఇవ్వు.' అని ఫోన్ పెట్టేసింది.

ఆ రాత్రి కవితా, కిరణ్‌లు అక్కడే ఉండిపోయారు. అభిషేక్, అనురాగ్‌లను పక్కన పడుకోబెట్టుకుని, కథలు చెపుతూ నిద్రలోకి జారిపోయాను, పసి హృదయాల చిలక పలుకుల తూగుటుయ్యాలలో ఊగిపోతూ.

* * *

కొండలూ, కోనలూ, సముద్రతీరాల మీంచి గగన విహారం చేస్తూన్నట్టు ఎగిరిపోతున్నా సువిశాలమైన విమానంలో. ఎగిరే పక్షుల్లాగా ఈ విమానాల సృష్టి మానవుని మేథకో ఒక ఉదాహరణ. వేలవేల మైళ్ళ దూరాన్ని ఎన్నో తీరాలు దాటుకుంటూ కొత్త మనుషుల మధ్య కొత్త వాతావరణంలో ప్రయాణం థ్రిల్లింగ్‌గానే అనిపించింది కాస్త అలసటగానే వున్నా. కొరియన్ ఎయిర్ లైన్సు కాబట్టి బొంబాయి ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు తరువాత కొరియాలోనే ఆగడం. అక్కడ కొన్ని గంటలు ఉండాల్సి వస్తుంది. అయినా బోరు కొట్టదు. అనుకోకుండా అప్పుడే అనేక ప్రాంతాల విదేశీయుల మధ్య, కళ్ళు అప్రయత్నంగానే మనవాళ్ళకోసం గాలిస్తూ ఉంటాయి. మన అంటే తెలుగువాళ్ళే కాదు. భారతీయులు. అక్కడి నుంచే మొదలవుతుంది, మన వాళ్ళని వెతుక్కోవడం. అందుకే అక్కడికి వెళ్ళిన వాళ్ళు,

కుల,మత, భాషా భేషజాలు లేక, మన కంట్రీనుంచి ఎవరు కనిపిస్తారా అని వెతుక్కుంటూ వుంటారు. ఒక తెలుగు, ఒక గుజరాతీ, ఒక బెంగాలీ, ఒక తమిళుడూ ఇలా సన్నిహితులైపోతారు. వాళ్ళకి 'ఇండియా' అనే మాటే ఒస్తుంది. మనందరం భారతీయులం అన్న భావన అక్కడే కలుగుతుంది.

కొరియాలో ఎక్కిన ప్లైటు లాస్ ఏంజిల్స్ వరకూ వెళుతుంది. అక్కడి నుంచి డొమెస్టిక్ ఫ్లయిట్‌లో ఫీనిక్స్‌కి వెళ్ళాలి. లగేజీ వాళ్ళే ఎక్కించేస్తారు.

ఫీనిక్స్ ఎయిర్‌పోర్టు రాగానే గుండె వేగం హెచ్చింది. కళ్ళు పత్తికాయల్లా విచ్చుకుని, నా వాళ్ళని వెతుకుతున్నాయి.'అమ్మమ్మా! యిక్కడ...'సౌందర్యా, దాని వెనక ఐశ్వర్యా పుష్పగుచ్ఛాలతో వచ్చారు. వెనకే నీతూ, రాజేష్‌లు.

ఆ కలయిక పులకింతల గిలిగింత. 'అమ్మమ్మా! అన్న ఆ తెలుగు పిలుపులోని మాధుర్యం, చిక్కని జున్ను పాల జున్నుకన్నా కమ్మదనం. వెడల్పయిన ఆ విమానాశ్రయం అందమైన కార్పెట్లతో, అద్భుతమైన దీపాల కాంతిలో వెలిగిపోతూ ఉంటే అక్కడ వెన్నెల పూచిందేమో అనిపిస్తుంది. ఎస్కలేటర్ల మీంచి జారిపోతున్నట్టు సాగిపోతూ వుంటే వింతైన అనుభూతి జారుడు బండమీద జారుతున్నట్టనిపిస్తుంది. నీతూ, రాజేష్‌లు లగేజీ తెచ్చారు.

'అమ్మ కస్టమ్స్‌లో గొడవేం లేదుగా!'

'లేదు. నన్ను ఒకటే ప్రశ్న అడిగింది ఆమె. ప్లాంట్లూ, పికిల్సూ ఉన్నాయా?' అని.

'లేవు' అని ధైర్యంగా చిన్న అబద్ధం చెప్పాను.

'మీరందరూ అలాగే చెప్తారు. పికిల్స్ వుండే వుంటాయి' అంది.

ఆమె నవ్వు చూసి ధైర్యం తెచ్చుకున్న నేనూ నవ్వేశాను. 'ఎక్కడికెళుతున్నారు?' అడిగింది. అమ్మాయి దగ్గరకి. 'ఎన్నాళ్ళుంటారు?' ఆరు నెలలు. స్టాంపు వేసి వెళ్ళమంది.

అప్పటికింకా ఇప్పుడున్న వాతావరణం లేదు. ఇప్పుడయితే, పికిల్స్ కాదు కదా, ఫేస్‌పౌడర్ కూడా తీసుకెళ్ళకూడదు. 'ఆంథ్రాక్స్' భయం కూడా కద!

'ఆవిడ మూడ్ బాగున్నట్టుంది. పైగా నాలాంటి వాళ్ళని రోజుకెంతమందిని చూస్తోందో! పైగా ఆవిడ కూడా బిడ్డల తల్లిలాగానే వుంది. అందుకే నవ్వుతూ 'నన్నొదిలేసింది' అన్నాను.

'నేను బతికిపోయాను. లేకపోతే ఆ సూట్‌కేసులు తెరిచి, ముయ్యడం నావల్ల అయ్యేది కాదు' అన్నారాయన.

పడవలాంటి పొడవైన కారులో వెడల్పాటి సిమెంటు రోడ్డుమీద, జారిపోతూన్నట్టు పరుగెట్టింది కారు. అంతా స్పీడే! కార్లు కూడా పరుగెడుతున్నట్టే కనిపిస్తాయి. రోడ్లమీద కూడా ఇంపైన రంగు రంగుల పూలచెట్లు. చెత్తా చెదారం మచ్చుకైనా కనబడదు.

ఇల్లు చేరగానే ఆటోమాటిక్‌గా తెరుచుకుంటుంది. స్విచ్ నొక్కగానే గ్యారేజి. అదొక మంచి గదిలాగా వుంటుంది. షెల్ఫులూ అలమారలూ అన్నీ అమర్చే వుంటాయి. నీతూ వాళ్ళది పెద్ద ఇల్లు. పెద్ద పెద్ద గదులు నాలుగు. ఇక్కడయితే ఒక్కో గదిని మూడు భాగాలు చేస్తారు. పెద్ద కిచెనూ. ఆ వంటగది చూస్తే, వంటరాని వాళ్ళకి కూడా వంట చెయ్యబుద్ధవుతుంది. స్విమ్మింగ్ పూలూ, ఆట ప్రదేశాలూ, వాళ్ళ వాళ్ళ బొమ్మలూ, పుస్తకాల బీరువాలూ, కంప్యూటర్లూ అన్నీ చూపించేశారు సౌందర్యా, ఐశ్వర్యలు. మా గదేదో చూపించింది నీతూ. స్నానాలు చేసి భోంచేస్తూ వుంటే 'తొందరగా తినమ్మమ్మా... మాకు కథలు చెప్పాలి' అంది సౌందర్య. 'అవును. గబ గబా... రా' అంది ఐశ్వర్య. వాళ్ళ తెలుగు మాటలు, చిలకలు పలుకుతున్నట్టుగా అనిపించింది.

'అమ్మమ్మా! మా గదిలో పడుకుని చెప్పు.'

'సరే!'

ఎన్ని కథలో నిద్దరొచ్చేవరకూ. రామూ, సోమూ, లిల్లీ, పిల్లీ, కుక్కా, నక్కా, చిలకా, ఎలకా అన్నీ కథా వస్తువులే! అవి మనుషుల్లా మాట్లాడుతున్నట్టు కల్పించి చెబుతుంటే ఎంత శ్రద్ధ! అదే మన పంచతంత్ర కథల స్పెషాలిటీ!

రోజూ వాళ్ళ పక్కలోనే నిద్ర. వాళ్ళ చేతులూ కాళ్ళూ నామీద వేసి అలా పడుకుంటే ఆ పరిష్వంగ సుఖం, ఆప్యాయతా మాటలకందనివి. మావారు మెల్లగా మాపక్కలోనే దూరేవారు.

ఇలా వేసవికాలం సెలవులయిపోయాయి. స్కూళ్ళు తెరిచేలోగా కొన్ని ప్రయాణాలు, ఫీనిక్స్ డౌన్‌టౌనూ, రివర్‌వ్యూ, అన్ని షాపింగ్ మాల్సూ ప్రతీరోజూ, కనీసం నాలుగు రోజులకొకసారయినా రకరకాల రెస్టారెంట్స్‌లో, రకరకాల పీజాలతో, ఐస్‌క్రీమ్‌లతో భోంచేసినా ఇంట్లో ఉన్నప్పుడల్లా పిల్లలూ, పెద్దలూ అందరూ, నా బొబ్బట్లు, జంతికలు, నా ఆవకాయా, చింతకాయ, కందిపొళ్ళూ, సాంబార్లూ తింటూ వుంటే మావారికేసి చూసేదాన్ని నా విజయానికి సంకేతంగా.

ఆయనా నవ్వేసేవారు నువ్వే గెలిచావులే అన్నట్లు.

టుసాను మీదుగా గ్రాండ్ కానియన్‌కి బయలుదేరాం. అదొక అద్భుతమైన కళాఖండం. కొలోరాడో నది ఆ భాగంలో ఎండిపోతూ ఉంటే విరిగిపడ్డ బండలు, గట్టిపడి కొండలుగా మిగిలిన మట్టిదిబ్బలూ కొన్ని వేల సంఖ్యలో, గుంపులు గుంపులుగా పేర్చినట్టు కనిపిస్తాయి.

కొన్ని వేల అడుగుల ఎత్తు నుంచి కిందికి వంగి ఈ దృశ్యాలు చూస్తూ వుంటే పాతాళాన్ని చూస్తున్నట్టనిపిస్తుంది. ఇప్పటికీ అక్కడక్కడా చిన్న కాలువల్లో పోలోరాడో పాయలు కనిపిస్తాయి. అక్కడ ఈ చిత్రాన్ని చూడ్డానికి జనం విరగబడి వస్తారు. లోపల తిరగడమే కష్టం. ప్రత్యేక బస్సులు ప్రతీ పాయింట్ దగ్గర ఆగి యాత్రికులను ఇబ్బంది పడకుండా చేస్తాయి. అకస్మాత్తుగా కురిసే చిరుజల్లులు పన్నీరు జల్లినట్టుగా అనిపిస్తాయి. అక్కడి నుంచి బయలుదేరి, 'ఫ్లాగ్ స్టాఫ్' అనే చోట రాజేష్ అన్నగారింట్లో ఆగాం. అందరం అలిసిపోయి ఉన్నాం. అయినా పక్క చేరుకున్నామో లేదో 'అమ్మమ్మా చిన్న కథ చెప్పు నిద్రపోతాం.' ఆ కోరికని కాదనే శక్తి నాకుందా? ఆవలింత లొస్తున్నా ఏదో కథ చెబుతూ కలత నిద్రలో పాత్రలపేర్లు తప్పు చెప్తే 'అమ్మమ్మా! నువ్వు తప్పు చెప్తున్నావ్. సరే పడుకో' అంటూ గట్టిగా కౌగిలించుకున్న ఆ చిన్నారుల కౌగిలింతలలోని వెచ్చదనం, భాషకందని భావం.

ఆ మర్నాడు సెయింట్ఫ్రాన్సిస్కోకి ప్రయాణం. సెయింట్ రమన్‌లో స్నేహితుల ఇంట్లో బస. అందరం కలిసి సెయింట్ ఫ్రాన్సిస్కోకి వెళ్ళి అక్కడి గోల్డెన్ బ్రిడ్జి, గోల్డెన్ గేటూ, మ్యూజియం అన్నీ చూసి ఆ అద్భుతాలలో తేలిపోతూ వుంటే పసివాళ్ళ మాటలు 'మా అమ్మమ్మ కథలెంత బాగా చెప్తుందో?' అని. యూనివర్సల్ స్టూడియోలో ఉదయం ఎనిమిది నుంచి రాత్రి పదకొండు గంటల దాకా గడిపాం. నా వయసు పదేళ్ళు - అంటే సౌందర్య. మావారి వయస్సు ఎనిమిదేళ్ళు - ఐశ్వర్య. ప్రతీదీ చూపిస్తూ వాటి గురించి వాళ్ళదివరకే చూశారు కనక వివరిస్తూ ఎత్తుమీంచి దూకడాలూ, మంటల మధ్య నుంచి విమానంలో ప్రయాణాలు, ఫైటింగులూ, జలపాతాలపై నుంచి నీళ్ళలో పడ్డట్టు, ఇవన్నీ హాలీవుడ్ చిత్రాలలో ఎలా షూట్ చేస్తారో చూపిస్తూ మేము వాటి మధ్యలోంచి ట్రెయిన్‌లోనూ, ప్లెయిన్‌లోనూ ప్రయాణించటం ఒక థ్రిల్లింగ్ అనుభవం. 'అంతెత్తు మీంచి మిమ్మల్ని పడేస్తుంటే మీకు భయం వేయలేదూ?' అని అందరూ అడిగిన ప్రశ్నకు నా జవాబు 'నా వయస్సు పది మావారి వయస్సు ఎనిమిది. భయం తెలీలేదు' అని. అది అక్షరాలా నిజం. సెయింట్ బార్ బరామీదుగా వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని దర్శించినప్పుడు, మన దేముళ్ళు అక్కడా చక్కగా మనవాళ్ళచేత పూజలందు కుంటున్నారంటే ఆనందం కలిగింది. ఇవన్నీ చూడడంలో ఇంచుమించు ముఖ్యమైన పట్టణాలు పడమరలో వున్నవి చూడ్డం అయింది.

పిల్లలు స్కూళ్ళకెళ్ళడంతో కొంచెం చిన్నబోయాను. అయితే అక్కడి స్కూళ్ళు ఉదయం ఎనిమిది నుంచి మూడు వరకే. ఆ సమయంలో నీతూతో కబుర్లు. మధ్య మధ్యలో స్కూల్లో పిల్లలు వేసే డ్రామాలు. వాళ్ళే రాసుకొని వాళ్ళే నటించడం విశేషం. టీచర్ల గైడెన్సు ఉంటుంది. కానీ పిల్లల్లో వాళ్ళ శక్తి సామర్థ్యాలు వెలువడే వేదికది.

ఇలా నాలుగు నెలలు పూర్తి చేసుకున్నాం. 'తూర్పు కూడా చూడాలి మీరు' నీతూ పట్టుదలతో బోస్టన్‌లోని మేనకోడళ్ళ దగ్గరికెళ్ళాం. కెనడీ మ్యూజియం చూస్తున్నంతసేపూ గాంధీజీ గుర్తుకొచ్చారు. ఒక ప్రత్యేకాభిమానం ఏర్పడుతుంది. అతని జీవిత విశేషాలు, డాక్యుమెంటరీ చిత్రాలు ఆకర్షిస్తాయి. ప్రసిద్ధి పొందిన హార్వర్డ్ యూనివర్శిటీ, ఎమ్. ఐ. సీ. యూనివర్శిటీ, బోస్టన్ టీపార్టీ చేసుకుని 'ఆమ్‌ట్రాక్' రైల్లో న్యూజెర్సీకి ప్రయాణించాం. రైలు ప్రయాణం విమాన ప్రయాణానికన్నా బాగుంటుంది. దారి పొడవునా చిన్న చిన్న ఊళ్ళు చూసుకుంటూ 'న్యూవాక్' స్టేషను చేరుకున్నాం. అక్కడ కవి స్నేహితురాలు అనూ వుంది. రకరకాల ఉద్యానవనాలూ, డిగ్‌నమ్ వాటర్‌ఫాల్స్, ఓక్‌ట్రీ రోడ్‌లోని ఇండియన్ షాప్సూ చూపించింది. తరువాత న్యూయార్క్‌కి సాధన, హేమంతులొచ్చి తీసుకెళ్ళారు. 'వరల్డ్ ట్రేడ్ సెంటర్ '(డబ్ల్యు. టీ. సి) నూట ఎనిమిది అంతస్థులు. ఒక్కొక్క అంతస్థులో ఎన్నో రకాల ఆఫీసులు. పై అంతస్థుకెళ్ళి చూస్తే ఒకవైపు న్యూజెర్సీ నగరం, మరోవైపు న్యూయార్క్ సిటీ! కింద రోడ్లూ, ఇళ్ళూ, కార్లూ బొమ్మల కొలువులా అనిపిస్తుంది. ఎంతసేపున్నా తనివితీరని ప్రదేశం.

తిరుగు ప్రయాణంలో అది సూర్యుడు రాలిపోయిన ఆకాశంలా, మట్టి దిబ్బలతో, చెత్తాచెదారాలతో విరిగిపడ్డ సిమెంట్ దిబ్బల మధ్య మూగపోయిన మానవ కంఠాల మధ్య మరో మరుభూమిలా వున్న ఆ ప్రదేశం చూస్తే గుండె తరుక్కుపోతుంది. అక్కడ ఎందరో తల్లులూ పిల్లలూ ఏడుస్తున్నట్టనిపించింది. 'ఏమండీ! సౌందర్యా, ఐశ్వర్యలు ఎలా ఉన్నారో' అన్నాను అప్రయత్నంగా. 'బాగానే వుంటారు' అన్నారాయన. బహుశః ఆయన మనసూ బాధతో మూలుగు తున్నట్టుంది. ఆడవాళ్ళలా తొందరగా బయటపడరు మగాళ్ళు!

న్యూయార్క్‌లో స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, ఎంపయర్ స్టేట్ బిల్డింగూ ఇతర ముఖ్య ప్రదేశాలూ బాగానే వున్నందుకు సంతోషిస్తూ, పిట్స్‌బర్గ్‌లో మేనల్లుడింటి కెళ్ళాం. అది చిన్నవూరే అయినా, డౌన్‌టౌనూ, మౌంట్ వాషింగ్‌టన్ లాంటి చూడవలసిన ప్రదేశాలతో పాటు, మన ఇండియాలోలాగా గోల్డెన్ పాయింట్ అనే చోట మూడు నదులు కలిసే సంగమం, వేంకటేశ్వరస్వామి దేవాలయం, జైన్ మందిరం ప్రత్యేక ఆకర్షణలు. ఇండియాకి సన్నిహితంగా అనిపిస్తుంది పిట్‌బర్గ్. 'బఫెలో'లో నాకు మరో మేనల్లుడుండడంతో, 'నయాగరా' కి కళ్ళు మూసుకుని వెళ్ళాం. ప్రపంచంలోని అద్భుతాల్లో ఒకటయిన నయాగరాని చూడ్డానికి ఒళ్ళంతా కళ్ళు కావాలి. అట్లాంటికాలో పుట్టి, బఫెలోలో ప్రయాణించే ఆ సముద్రకెరటాల తరంగాల వేగం, నురుగులు చిమ్మే పాలసముద్రంలా ఒకచోట కనిపిస్తే, నీలి రంగుల హొయలుతో మరోచోట అనిపిస్తే, ఆకుపచ్చగా మరోచోట, బంగారు వన్నెలా మరో దిక్కునా తన్మయులను చేస్తుంది నయాగరా! నీలిరంగు రెయిన్ కోట్లతో స్టీమర్‌లో ప్రయాణం ఒక

థ్రిల్! అలాగే పసుపురంగు రెయిన్ కోట్లతో రబ్బరు చెప్పులు ధరించి, మెట్టు మెట్టు ఎక్కుతూ 'కేవ్ ఆఫ్ ది లిండ్స్' లోకి వెళుతూ వుంటే సముద్రం ఎగిసిపడుతూ మనకి తలంటి పోసినట్టు రెండు వైపుల నుంచి నీళ్ళు కుమ్మరిస్తూ వుంటే, చివరి మెట్టు 'హరికేన్ డెక్' దగ్గరికొచ్చేసరికి నీరూ, ఆకాశం కలిసిపోయినట్టు 'ఆశ్చర్యం, ఆనందం, కించిత్ భయం' అన్నీ కలబోసిన మిశ్రమ అనుభూతి. మాటలకందని ఆవేశం, ఆనందం. ఆ స్థితి అద్వైతం... అమోఘం! ఈ దృశ్యాలే కెనడా దేశంలో మరో కోణం నుంచి అగుపిస్తాయి. కెనడాలోని సి.ఎన్. టవర్స్ నూటముప్ఫై ఏడు అంతస్థులూ ముప్ఫై ఎనిమిది సెకన్లలో పోతాం లిఫ్టులో. న్యూయార్క్‌లోని వరల్డ్‌ట్రేడ్‌సెంటర్ కన్నా కొన్ని అంతస్థులు ఎక్కువ. ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ 'గ్లాస్ ఫ్లోర్.' ఒక అంతస్థులో పై అంతస్థులో! అక్కడ కాలు పెడితే, గ్లాసు విరిగితే కింద పడతాం అన్న భయం కలుగుతుంది ప్రతీవాళ్ళకీ. అక్కడి నుంచి కిందికి చూస్తూ ప్రతీదీ చీమల సైజులో కనిపిస్తుంది. ఇలా ఎన్ని అద్భుతాలు చూసినా మళ్ళీ రాత్రి కాగానే పిల్లల జ్ఞాపకాలు!

* * *

ఇలా ఆరు నెలలూ పూర్తయ్యాయి. తిరుగు ప్రయాణం, మన ఊరికి మనం వెళ్తున్నాం అన్న సంతోషం కన్నా ఇవన్నీ మళ్ళీ చూడగలమా? అన్న ప్రశ్నతో అక్కడి వాళ్ళమీద ప్రాణం కొట్టుకుంటూ, సర్దుకోవడాలు, విమానం ఎక్కడాలూ జరిగిపోయింది.

'ఏమండీ! మళ్ళీ వీళ్ళనెప్పుడు చూస్తామో!'

నన్నూరడించడానికేమో 'ఏముందీ! ఎప్పుడు తలుచుకుంటే అప్పుడే' అన్నారు.

ఆ రాత్రి గబగబా నాలుగు మెతుకులు గతికి పడుకున్నాను. కాస్సేపు కవితా పిల్లలతో ఆడుకుని ఆయనా తొందరగానే పడుకున్నారు. కవితా, కిరణ్‌లు 'జెట్‌లాగ్ లే' అనుకున్నారు.

ఈ ఆరునెలల్లోనే పెద్ద వాళ్ళయిపోయినట్టు, అభిషేక్, అనురాగ్‌లు వేరే గదిలో పడుకున్నారు.

అర్ధరాత్రి దాటిందేమో! కన్ను మూతపడడంలేదు. అటూ ఇటూ కదులుతూ దొర్లుతున్నాను. విసుగుపుట్టి దుప్పటి ముసుగుని ఒక్క తన్ను తన్నాను.

ఆయనా ముసుగు తీసి నాకేసి చూశారు.

'మీరు నిద్రపోలేదా?'

'నువ్వూ నిద్రపోలేదా?'

'లేదు... ఇప్పుడు కథలు ఎవరికి చెప్పాలో అర్థం కావడంలేదు. అభిషేక్, అనురాగ్‌లు ఇంక మన పక్కన పడుకోరు. వాళ్ళ వ్యాపకాలు వేరవుతున్నాయి' అన్నాను.

ఆయన నవ్వారు.

'ఎందుకు నవ్వుతున్నారు?'

'నీ పిచ్చికి.'

'అంటే...'

'పిల్లలు ఎప్పటికీ పిల్లలుగానే వుండిపోతారా? మనం మళ్ళీ కలిసేసరికి సౌందర్యా, ఐశ్వర్యా కూడా అంతే! ఇంకా ఎదిగాక వాళ్ళూ తల్లులవుతారు. అప్పుడు వాళ్ళమ్మ తన మనవలకి కథలు చెబుతుంది' అన్నారు. నాకు బోధన చేస్తున్నట్టు.

'ఏమిటో ఈ బంధాలు! అసలుకంటే కొసరెక్కువ అంటే ఇదే.'

'అదేం కాదు. పిల్లలు చిన్నగా వున్నప్పుడు, వాళ్ళ అమ్మానాన్నలు అనేక విధాలుగా బిజీగా వుంటారు. అమ్మమ్మలూ బామ్మలూ ఖాళీగా వుంటారు కనుక, వాళ్ళతో కబుర్లు చెబుతూ, ఆడుకుంటూ, ఓపిగ్గా వాళ్ళకి కావలసినవి చేస్తారు కనుక, మనవలూ, మనవరాళ్ళూ వీళ్ళనొదలరు. వీళ్ళకీ కాలక్షేపం, వాళ్ళకేవేవో నేర్పించాలన్న తపన కనక వీళ్ళు వాళ్ళతో వుండడం. ఇది ఇద్దరి అవసరాలూ తీరుస్తుంది. అదే జీవితం' అన్నారాయన.

ఆయన చెప్పేవన్నీ నిజాలే అయినా, నా మనసు మాత్రం ఆ మమతల పందిళ్ళకోసం, ఆ చిట్టి చేతుల కౌగిళ్ళకోసం తపిస్తూనే వుంది. ఓదార్పాలనేమో నా నడుం మీద చెయ్యివేశారాయన.

అందులో రసికత లేదు. మరే భావమూ కలగలేదు. కానీ ఒక్క క్షణం ఆ చిన్నారుల చిట్టి చేతులు జ్ఞాపకం వచ్చాయి. ఒళ్ళు పులకించింది. కళ్ళు మూతలు పడ్డాయి తృప్తిగా.!

* * *